సాక్షి మంచిర్యాల

సోమవారం, 23, జనవరి, 2023



వైభవంగా 'వసంత' వేడుక

వసంత పంచమిని పురస్కరించుకుని బాసర సరస్వతీ అమ్మవారిని దర్శనానికి వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. 10లో▸



అతివలకు బాసటగా..

సింగరేణి బొగ్గు ఉత్పత్తిలోనే కాదు సామాజిక సేవలోనూ ముందే ఉంటోంది. సంస్థ తనపై ఆధారపడ్డ వారికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. 8లో▸



వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండగా అనిపిస్తుంది. రాత్రి చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది.

న్యూస్‌రీల్

అలరించిన కవి సమ్మేళనం



కిషన్‌శర్మను సన్మానిస్తున్న కవులు, రచయితలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక సరస్వతీశిశుమందిర్‌లో సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. అభినవ పోతన వానమామలై వరదాచార్యుల చరిత్రను వరదాభ్యుదయం పేరిట పద్య కావ్య ఖండికను నిర్వహించారు. కవి పెండ్యాల కిషన్‌శర్మ ఐదు అశ్వాలుగా రచించిన కావ్యాన్ని ఎంతో మధురంగా ఆలపించారు. ఈసందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వామన్‌రావు, ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కవులు, రచయితలు పట్వర్థన్, రాజిరెడ్డి, విశ్వేశ్వరశర్మ, నందమయ్య, సుగుణాకర్, పెద్ది భరత్, ధనుంజయ్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లింగుస్వామి ఆలయంలో డీసీసీ అధ్యక్షురాలి పూజలు



పూజలు చేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

కాసిపేట: మండలంలోని కుర్రేఘాట్‌లో కూపర్ లింగుస్వామి జాతరకు డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆదివారం హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. షెడ్డు నిర్మాణం సొంతంగా చేపడతానని హామీ ఇచ్చారు. ఆమె వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ, ఎంపీటీసీలు పార్వతి మల్లేశ్, మేరుగు పద్మ, శంకర్, ఆదివాసీ నాయకులు కనకరాజు, ప్రభాత్‌రావు, చిలుకయ్య, శంకర్, అన్నం కుమార్, జంగిల్ రమేశ్ ఉన్నారు.

భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలఅర్బన్: అన్ని క్యాడర్ల ఉపాధ్యాయ పదోన్నతులతోపాటు భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ ఆధ్వర్యంలో మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, డీఈవో వెంకటేశ్వర్లుకు ఆదివారం వేర్వేరుగా వినతిపత్రం ఇచ్చారు. టీచర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌తోపాటే భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు పండితులను అప్‌గ్రేడ్ చేసి న్యాయం చేయాలని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణచారి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాసవర్మ, కోశాధికారి సంతోష్, రాష్ట్ర బాధ్యులు శివకుమార్, సురేందర్ తదితరులు ఉన్నారు.

కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న బీజేపీ



మాట్లాడుతున్న కలవేణి శంకర్

మంచిర్యాలక్రైం: ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతూ, ఎనిమిదేళ్లుగా కార్పొరేట్ శక్తులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఊడిగం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేణి శంకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఖలీందర్ అలీఖాన్ అధ్యక్షతన సీపీఐ జిల్లా సమితి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ జనవరి 26న నిర్వహించే గణతంత్ర వేడుకలు దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నాం కానీ రాజ్యాంగాన్ని సవరించడం ఆపాలని డిమాండ్ చేశారు. జనవరి26 రాజ్యాంగ పరిరక్షణ దినం పాటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 5 నుంచి ఇంటింటా వనరుల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. వెంకటస్వామి, లింగయ్య, పూర్ణిమ, చంద్రశేఖర్, మల్లయ్య, నగేశ్, రవి, శ్రీనివాస్, మల్లేశ్, సుదర్శన్, నర్సయ్య పాల్గొన్నారు.

మెడికల్‌కు స్థలం!



- ఎట్టకేలకు కేటాయింపు
- జిల్లా కేంద్రంలోనే నిర్మించాలని నిర్ణయం
- భూదాన్ భూమి స్థలం నుంచి సాయికుంటకు

మంచిర్యాలటౌన్: జిల్లా వాసులకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు మెడికల్ కళాశాల మంజూరు చేయాలని డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఈమేరకు హామీ ఇచ్చారు. ఎట్టకేలకు గతేడాది మెడికల్ కళాశాల మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే మంచిర్యాలకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంజూరు నుంచి శాశ్వతంగా భవనం నిర్మాణం కోసం స్థలం విషయంలో అధికారులు తర్జనభర్జన పడుతూనే ఉన్నారు. మంచిర్యాలలో మెడికల్ కళాశాల వస్తుందనే జిల్లా కేంద్రంలోని గోదావరి రోడ్డులో ఉన్న భూదాన్ భూములను కేటాయించారు. గర్మిళ్ల శివారులోని భూదాన్‌యజ్ఞ బోర్డు భూములు సర్వే నంబర్ 707, 708లోని 22 ఎకరాలను కేటాయించారు. అందులో మాతా శిశు ఆరోగ్య కేంద్రం సైతం నిర్మించి, గతేడాది వైద్య సేవలు ప్రారంభించారు. ఇదే చోట ప్రభుత్వ మెడికల్ కాలేజీతోపాటు, నర్సింగ్ కాలేజీ నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు.

భూదాన్ భూములకు వరద ముప్పు..

కాగా, భూదాన్ భూమిలో 22 ఎకరాల స్థలం ఉన్నా, గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఆ భూమి వరద నీటిలో మునిగింది. ఎంసీహెచ్ భవనం కూడా పూర్తిగా వరదలో మునిగిపోయింది. దీంతో మెడికల్ కాలేజీ నిర్మాణం భూదాన్ భూమిలో చేపట్టకుండా మరో చోటుకు మార్చేందుకు ఆరు నెలలుగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

మెడికల్ కాలేజీలో అన్ని రకాల వసతులు



ప్రస్తుతం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలో అవసరమైన తరగతి గదులతోపాటు, ల్యాబ్‌లు, మౌలిక వసతులు కల్పించాం. విద్యార్థులకు మొదటి సంవత్సరం తరగతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహిస్తున్నాం. పర్మినెంట్ భవనం కోసం స్థలాలను పరిశీలిస్తున్నారు. స్థలం ఎంపిక ప్రక్రియ డీఎంఈ అధికారులు చేస్తున్నారు. స్థలం ఎంపిక పూర్తయితే నిర్మాణ పనులను ప్రారంభిస్తారు.

– డాక్టర్ ఎండీ.సులేమాన్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, మంచిర్యాల

తాత్కాలిక భవనంలో..



తాత్కాలిక భవనంలో మెడికల్ కాలేజీ

జిల్లాకు మెడికల్ కాలేజీని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడంతో, 2022–23 సంవత్సరానికి కేంద్రం నుంచి అనుమతులు తీసుకుని ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించేందుకు తాత్కాలికంగా వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాములను మెడికల్ కాలేజీ కోసం సిద్ధం చేశారు. దీంతో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రేకుల షెడ్డులో మెడికల్ కాలేజీ ఏర్పాటుపై అభ్యంతరం వ్యక్తం చేసింది. అనుమతులను ఇవ్వడంలో జాప్యం చేశారు. మరోచోట శాశ్వతంగా మెడికల్ కాలేజీ భవనాన్ని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడంతో, ఈ ఏడాదికి 150 సీట్లకు 100 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతులు ఇస్తూ, మెడికల్ కాలేజీ నిర్వహణకు అనుమతి ఇచ్చారు. రెండో ఏడాది ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభం నాటికి మెడికల్ కాలేజీ శాశ్వత భవనం నిర్మించాలన్న ఒప్పందం మేరకు మెడికల్ కాలేజీ అనుమతులు వచ్చాయి.

సాయికుంట స్థలం ఫైనలయ్యేనా...?

భూదాన్ భూమి వరద నీటిలో మునిగి పోవడంతో మెడికల్ కాలేజీని నిర్మించేందుకు నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సుమారు 25 ఎకరాల అటవీ భూములను గుర్తించారు. సింగరేణి పరిధిలో ఉన్న అటవీ భూముల్లో కళాశాల నిర్మాణం కోసం దాదాపుగా అన్ని ప్రయత్నాలు చేపట్టినా, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రంకు మెడికల్ కాలేజీకి దూరం ఎక్కువ కావడం, జిల్లా కేంద్రానికి దూరంగా ఉండడంతో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి అనుమతులు వస్తాయో రావోననే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. దీంతో జిల్లా కేంద్రంలోని దాదాపుగా అన్ని ప్రభుత్వ భూములను పరిశీలించి, చివరకు సాయికుంటలోని సుమారు 14.13 ఎకరాల స్థలాన్ని ఎట్టకేలకు ఎంపిక చేశారు. ఈ స్థలాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించేందుకు సోమవారం జరిగే మున్సిపల్ సాధారణ సమావేశంలో తీర్మానం చేయనున్నారు. ప్రస్తుతం మార్కెట్ యార్డులో దాదాపు రూ.14 కోట్లను ఖర్చు చేసి మెడికల్ కళాశాల తరగతి గదులు, ల్యాబ్‌లతోపాటు, అన్ని రకాల మౌలిక వసతులు కల్పించారు. కొత్తగా మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టేందుకు ఏడాదికి పైగా సమయం పట్టనుండగా, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి రెండో సంవత్సరం అనుమతులు వచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నారు. సాయికుంటలోని స్థలాన్ని దాదాపుగా ఖరారు చేసినా, మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు జరిగే వరకు మరోసారి స్థలం మార్పు ఉంటుందో లేదో చెప్పలేమని మెడికల్ కాలేజీ సిబ్బంది చెబుతున్నారు. మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులను మొదలు పెడితేనే మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి పూర్తిస్థాయిలో మెడికల్ కాలేజీకి అనుమతులు వచ్చే అవకాశం ఉంది.

యాసంగి ఆశలు ఆవిరి!



చిత్రంలో బీటలువారి కనిపిస్తున్న వరి పొలం దండేపల్లి శివారులోని డిస్ట్రిబ్యూటరీ 28 పరిధిలోనిది. మొదటి తడి నీళ్లు వచ్చినప్పుడు రైతు నాటు వేశాడు. ప్రస్తుతం నీటిసరఫరా నిలిచి పోయింది. దీంతో నాటేసిన పొలం ఇలా బీటలు వారింది. నాటుకు సిద్ధం చేసుకున్న మడులు కూడా నీరులేక ఎండిపోతున్నాయి. యాసంగి సీజన్ ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే ముందు ఇంకెన్ని నీటి కష్టాలు ఉంటాయో అని రైతులు కలత చెందుతున్నారు.

- కడెం నీరందదు.. గూడెం ఎత్తిపోయదు!
- ఆందోళనలో ఆయకట్టు చివరి రైతులు..

దండేపల్లి: తలాపునే గోదావరి పారుతోంది. పుష్కలంగా నీళ్లు ఉన్నాయి. కానీ పంట భూములు మాత్రం బీళ్లుగా మారి ఎడారిని తలపిస్తున్నాయి. ఇదీ కడెం ఆయకట్టు చివరి పరిస్థితి. ఈ ఏడాది వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు కడెం ఆయకట్టు భూముల్లో పంటలు వేసిన రైతులకు ఆశించిన దిగుబడి రాలేదు. వానాకాలం నష్టాలను యాసంగిలో పూడ్చుకుందామనుకున్న రైతుల ఆశలు ఆవిరయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఆయకట్టు చివరి భూములకు సాగు నీరందించేందుకు గోదావరి ఒడ్డున నిర్మించిన శ్రీసత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం తరచూ మొరాయిస్తోంది. కొన్ని రోజులు మోటార్ల మరమ్మతు, కొన్ని రోజులు పైపులైన్ లీకేజీలతో సీజన్ ప్రారంభంలో ఇప్పటి వరకు కనీసం వారం రోజులు కూడా నీరు అందించలేదు. ఇక కడెం ప్రాజెక్టు నుంచి అయినా నీరందుతుందనుకుంటే.. ప్రస్తుతం కాలువ ద్వారా విడుదల చేసిన నీరు కేవలం డీ–28 వరకు మాత్రమే వారబందీ పద్ధతిలో ఇస్తున్నారు. డీ–30 నుంచి 42 వరకు గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించాలి. మరమ్మతుల కారణంగా సాగునీరందక ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి..

నిర్మల్ జిల్లాలో ఉన్న కడెం ప్రాజెక్టు ఆయకట్టు విస్తీర్ణం 68 వేల ఎకరాలు కాగా, ఎక్కువ విస్తీర్ణం మంచిర్యాల జిల్లాలోనే ఉంది. ఇందులో కడెం ఆయకట్టు కింద నిర్మల్ జిల్లాలోని కడెంతోపాటు, మంచిర్యాల జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాలకు సాగునీరందిస్తారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, కడెం ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం ఉంటే ఖరీఫ్‌లో ఆయకట్టు పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ 1 నుంచి 42 వరకు పూర్తిస్థాయిలో సాగునీరందిస్తున్నారు. రెండో పంటకు మాత్రం పూర్తిస్థాయిలో సాగునీరందడం లేదు. రైతుల సమస్య పరిష్కరించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి 2009లో గూడెం వద్ద గోదావరి ఒడ్డున ఎత్తిపోతల పథకం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. 2015లో పనులు పూర్తికావడంతో ప్రారంభించారు.



ఎత్తిపోతల పథకం పనిచేయక ఖాళీగా కనిపిస్తున్న డి-30 వద్ద కాలువ

కడెం పరిస్థితి అంతంతే..

కడెం ప్రాజెక్టులో ప్రస్తుతం 692 అడుగుల నీటిమట్టం ఉంది. గతేడాది ఈ సమయంలో 697 అడుగులు ఉంది. ఈసారి ప్రాజెక్టులో 5 అడుగుల నీటిమట్టం తక్కువగా ఉండటంతో ప్రస్తుత యాసంగికి కడెం నీటిని డిస్ట్రిబ్యూటరీ 1 నుంచి 28 వరకు మాత్రమే వారబందీ పద్ధతిలో అందిస్తున్నారు. కడెం నీరు కూడా యాసంగి పంటలు పూర్తయ్యే వరకు అందుతుందో లేదో తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికే డిస్ట్రిబ్యూటరీ 28వరకు సక్రమంగా నీరందడం లేదు. డి–22 వరకు మాత్రమే కష్టంగా నీరందుతోందని రైతులు పేర్కొంటున్నారు. పరిస్థితి చూస్తుంటే అటు కడెం నీరందక, ఇటు గూడెం ఎత్తిపోతల పథకం మరమ్మతుల కారణంగా ఆయకట్టు చివరి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

25 రోజుల్లో ఎత్తిపోసింది 5 రోజులే..

గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం ద్వారా ఈసారి యాసంగి సాగుకు గత డిసెంబర్ 29న ఎమ్మెల్యే దివాకర్‌రావు సాగునీటిని విడుదల చేశారు. నీటి విడుదల ప్రారంభించి ఆదివారం నాటికి 25 రోజులైంది. కానీ నీళ్లు ఎత్తిపోసింది మాత్రం కేవలం 5 రోజులే. తరచూ పైపులైన్ పగిలిపోవడం, లీకేజీ కావడంతో 20 రోజులు మోటార్లు నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు. దీంతో నీరందక పంటలు ఎండిపోతున్నాయి. ఆయకట్టు రైతులు సాగునీటి కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేసినా స్పందించేవారు కరువయ్యారు.

మరమ్మతులు కొనసాగుతున్నాయి

గూడెం ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ రెండు చోట్ల లీకైంది. ఒకచోట మరమ్మతు పూర్తిచేశాం. ఇంకోచోట మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకుంటున్నాం. కడెం ప్రాజెక్టులో ఈసారి గతేడాదికంటే నీటిమట్టం తక్కువగా ఉంది. ఐదు తడులకు మాత్రమే డీ–1 నుంచి డీ–28 వరకు నీరందించాలని నిర్ణయించాం.

– రాజశేఖర్, ఈఈ కడెం ప్రాజెక్టు

జై నాగోబా

- ఉట్టిపడిన 'మెస్రం' సంప్రదాయం
- కేస్లాపూర్‌కు పోటెత్తిన భక్తజనం
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రత్యేక పూజలు



కేంద్ర మంత్రితో పాటు ఎంపీలు సంజయ్, సోయంను సన్మానిస్తున్న మెస్రం వంశీయులు

కైలాస్‌నగర్: మెస్రం వంశీయుల ఆరాధ్యదైవమైన నాగోబా జాతర వైభవంగా సాగుతోంది. ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో తొలిరోజు మహాపూజతో జాతర ప్రారంభం కాగా ఆదివారం మెస్రం వంశీయుల సంప్రదాయ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బారులు తీరి నాగోబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం రాత్రి నుంచే భక్తులతో కిటకిటలాడింది.

సంప్రదాయబద్ధంగా..

నాగోబా జాతర సంప్రదాయబద్ధంగా సాగుతోంది. కొత్త ఆలయంతో శనివారం రాత్రి నాగోబాకు మహాపూజ నిర్వహించారు. అర్ధరాత్రి తర్వాత మెస్రం వంశీయులు ఆనవాయితీగా కొత్త కోడళ్ల భేటింగ్ నిర్వహించారు. ఆదివారం మర్రి చెట్టు వద్ద ఉన్న కోనేరు నుంచి నీటిని తీసుకొచ్చి కొత్త కోడళ్లు నైవేద్యాన్ని వండి నాగోబాతో పాటు సతిదేవళ్లకు సమర్పించి ఉపవాస దీక్షలు విరమించారు. రెండోరోజు జాతరకు జన సందడి కనిపించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే కాకుండా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి కూడా తరలివచ్చారు. మంగళవారం గిరిజన దర్బార్ నిర్వహించనున్నారు. మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతిరాథోడ్ హాజరుకానున్నారు.

కేంద్ర మంత్రి పూజలు..

కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి అర్జున్‌ముండా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నాగోబాను దర్శించుకుని గర్భగుడిలో పూజలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో కేస్లాపూర్ ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న కేంద్ర మంత్రికి ఎంపీ సోయం బాపురావు, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రితో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు మెస్రం వంశీయులు, బీజేపీ శ్రేణులు సంప్రదాయ వాయిద్యాలు, థింసా నృత్యంతో ఘన స్వాగతం పలికారు. వంశ పెద్దలు సంప్రదాయ తలాపాగాను చుట్టి ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం శాలువాలతో సత్కరించి నాగోబా దేవత చిత్రపటాలను అందజేశారు. కాగా ఆదిలాబాద్ పట్టణ బీజేపీ నాయకులు కేంద్ర మంత్రిని గజమాలతో సత్కరించారు.

సమస్యల ఏకరువు

నాగోబా దర్శనానంతరం నాగోబా దర్బార్ హాల్‌లో బహిరంగసభ నిర్వహించారు. కార్యక్రమంలో మాట్లాడిన ఆలయ చైర్మన్ మెస్రం తుకారాం, పీఠాధిపతి వెంకట్‌రావు, స్థానిక సర్పంచ్ రేణుకా నాగ్‌నాథ్ ఆలయంలో సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర మంత్రి నేలపైనే కూర్చుండి సమస్యలపై చర్చించారు. భక్తుల సంఖ్య పెరుగుతున్నందున సమావేశ మందిరం ఏర్పాటు చేయాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని నివేదించారు. ఇందుకు కేంద్ర మంత్రితో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సానుకూలంగా స్పందించారు. సమస్యలపై ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపిస్తే వాటిని ప్రధాని దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామని భరోసానిచ్చారు. అనంతరం బీజేపీ నేతలు మెస్రం పెద్దలతో కలిసి భోజనాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, నాయకులు చిట్యాల సుహాసినిరెడ్డి, కంది శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమేందర్‌రెడ్డి, రాళ్లబండి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



జాతరలో భక్తుల సందడి



మెస్రం వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటున్న కొత్త కోడళ్లు



కోనేరు నీటికోసం గోవడ్ నుంచి బయల్దేరిన కొత్త కోడళ్లు

గూడెంలో జస్టిస్ చంద్రయ్య పూజలు



సత్యదేవున్ని దర్శించుకుంటున్న జస్టిస్ చంద్రయ్య

దండేపల్లి: రెండో అన్నవరంగా ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామిని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదపండితులు, అర్చకులు ఆశీర్వదించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆయన వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్తయ్య, న్యాయవాదులు సురేందర్, శ్రీధర్, ఎస్సై సాంబమూర్తి ఉన్నారు.

స్వగ్రామానికి వచ్చిన జస్టిస్ చంద్రయ్య..

జన్నారం: మానవహక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య ఆదివారం స్వగ్రామం జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామానికి వచ్చారు. గ్రామంలోని పురాతన శ్రీసీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో చిన్ననాటి స్నేహితులు, గ్రామస్తులతో మాట్లాడారు. వరదల కారణంగా దెబ్బతిన్న ఆలయానికి మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులు కమ్మల విజయధర్మా, ఎంబడి సత్యం చైర్మన్‌ను సన్మానించారు. ఆయన వెంట జిల్లా న్యాయమూర్తి సత్తయ్య, లక్సెట్టిపేట్ కోర్టు న్యాయమూర్తి మహమ్మద్ అసదుల్ల షరీఫ్, న్యాయవాది మల్లేశ్, సీపీఎస్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్, ఎంపీటీసీ వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ ఉన్నారు.

క్లుప్తంగా

రైలుకిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్‌: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కాగజ్‌నగర్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ కె.సురేష్‌గౌడ్‌ వివరాల ప్రకారం... ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి (55) కాగజ్‌నగర్‌ రైల్వే స్టేషన్‌ సమీపంలో బల్లార్షా వైపు వెళ్తున్న గూడ్స్‌ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి ఒంటిపై ఆరెంజ్‌ కలర్‌ టీషర్ట్‌, చాక్లెట్‌ కలర్‌ స్వెటర్‌, ఆకుపచ్చని కలర్‌ నైట్‌ పాయింట్‌ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని సిర్పూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు సెల్‌: 9440900792, 9440700038లపై సంప్రదించాలని కోరారు.

మెడికల్‌ కళాశాలకు పార్థీవదేహం అప్పగింత


కళావతి (ఫైల్‌)

చెన్నూర్‌: చెన్నూర్‌ పట్టణానికి చెందిన జన్నం కళావతి (65) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. కళావతి ఆరేళ్ల క్రితం సదాశయ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో అవయవదానానికి అంగీకరించింది. కళావతి మృతిచెందడంతో ఆమె సోదరులు జన్నం కైలాసం, నాగభూషణం, శంకర్‌, ధనుంజయ్‌, రవీందర్‌లు ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. వారు పార్థీవదేహాన్ని రామగుండం మెడికల్‌ కళాశాలకు అప్పగించారు. కార్యక్రమంలో కళాశాల ఫౌండేషన్‌ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్‌, వాసు, కోరాళ్ల రాంరెడ్డి, పుల్లూరి సత్తెయ్య పాల్గొన్నారు.

లోత్‌ఒర్రెలో అటవీశాఖ అధికారుల దాడులు

జన్నారం: జన్నారం అటవి డివిజన్‌ పరిధిలోని లోత్‌ఒర్రె గ్రామంలో అటవీశాఖ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఇళ్లతో పాటు పంట చేనుల్లో తనిఖీలు చేసి 10టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.80 వేలు ఉంటుందని ఇందన్‌పల్లి రేంజ్‌ అధికారి హఫీజోద్దీన్‌ తెలిపారు. ఈ దుంగలపై విచారణ చేసి నిందితులను పట్టుకుంటామని ఎఫ్‌ఆర్‌వో తెలిపారు. ఈ దాడులలో డిప్యూటీ రేంజ్‌ అధికారి ప్రమోద్‌కుమార్‌ పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

కాగజ్‌నగర్‌రూరల్‌: మద్యానికి బానిసై ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని నజ్రూల్‌నగర్‌ విలేజీ నం.12 గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఏఎస్సై హీరామాన్‌ వివరాల ప్రకారం... రంజిత్‌ మండల్‌ (40) మద్యానికి బానిసై జులాయిగా తిరిగేవాడు. జీవితంపై విరక్తితో ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య రజిత మండల్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కేసు నమోదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌ శివారులో ముగల మహేష్‌, తగరం వెంకటేశ్వర్లుకు చెందిన భూమిని అక్రమించేందుకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మహేష్‌, వెంకటేశ్వర్లు 2018లో సర్వేనంబర్‌ 130/2లో 23 గుంటల భూమిని గాజుల సత్తయ్య పట్టాదారు వద్ద నుంచి కొనుగోలు చేశారు. ఆ భూమికి హద్దులు ఏర్పాటు చేసుకుని షెడ్డును నిర్మించారు. అయితే మంచిర్యాలకు చెందిన రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి తోట శ్రీనివాస్‌ తన అనుచరులతో కలిసి ఈ నెల 21న షెడ్డును తొలగించి, హద్దు రాళ్లను తొలగించాడు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చిన్నారులపై పిచ్చికుక్కల దాడి

భీమారం: మండలంలోని కుమ్మరివాడకు చెందిన గొల్లపల్లి వేదాంత్‌, హర్షిత్‌ అనే చిన్నారులను ఆదివారం పిచ్చికుక్కలు దాడిచేసి గాయపరిచాయి. గమనించిన కుటుంబ సభ్యులు వారిని ఆస్పత్రికి తరలించారు. పిచ్చికుక్కల బెడదను తగ్గించాలని స్థానికులు కోరుతున్నారు.

అతివలకు బాసటగా..

- సింగరేణిలో ఉచితంగా వృత్తి శిక్షణ కోర్సులు
- ఉత్సాహంగా నేర్చుకుంటున్న మహిళలు
- ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట
- టైలరింగ్‌, బ్యూటీషియన్‌ తదితర కోర్సుల్లో..


నస్పూర్‌ కాలనీ సేవా భవన్‌లో టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

శ్రీరాంపూర్‌లో శిక్షణ కేంద్రంలో నేర్చుకున్న వారి వివరాలు..

ఏడాది	శిక్షణ పొందినవారు	అయిన ఖర్చు రూ.లలో
2016–17	53	4,00,179
2017–18	243	8,18,245
2018–19	387	6,05,431
2019–20	235	23,145,45
2020–21	58	2,02,300
2021–22	117	2,83,273
2022–23	413	5,00,000
మొత్తం	1506	51,23,973

శ్రీరాంపూర్‌: సింగరేణి బొగ్గు ఉత్పత్తిలోనే కాదు సామాజిక సేవలోనూ ముందే ఉంటోంది. తనలో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న సంస్థ తనపై ఆధాపడ్డ వారికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. దీనికి సింగరేణి సేవా సమితి అందిస్తున్న కోర్సులే నిదర్శనం. శ్రీరాంపూర్‌ డివిజన్‌లో సింగరేణి సేవా సమితి ద్వారా కార్మికులు, రిటైర్డ్‌ కార్మికుల కుటుంబ సభ్యులతో పాటు పరిసర గ్రామాల్లోని వారికి అనేక వృత్తి శిక్షణ కోర్సులను ఉచితంగా నేర్పించి వారు స్వయం ఉపాధి బాటలు వేస్తున్నారు. ముఖ్యంగా మహిళలకు అందిస్తున్న వృత్తి శిక్షణ కోర్సులు మంచి ఫలితాలనిస్తున్నాయి. కోర్సులు నేర్చుకున్న వారు స్వంత యూనిట్లు పెట్టుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. చాలా ఏళ్లుగా ఈ కోర్సులు నడుస్తున్నప్పటికీ కరోనాతో కొంత కాలం నిలిచిపోయి రెండు నెలల క్రితమే తిరిగి ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం శ్రీరాంపూర్‌ డివిజన్‌లో మహిళల కోసం టైలరింగ్‌, బ్యూటీషియన్‌, మగ్గం వర్క్‌, జ్యూట్‌ బ్యాగ్‌ తయారీ కోర్సులు నిర్వహిస్తున్నారు. శ్రీరాంపూర్‌లోని సేవా భవన్‌, నస్పూర్‌ కాలనీలోని సేవా భవన్‌లో ఈ కోర్సులను అందిస్తున్నారు. నిత్యం 450 మంది మహిళలు, యువతులు నిత్యం ఇక్కడికి వచ్చి శిక్షణ పొందడంతో కేంద్రాలన్నీ కళకళలాడుతున్నాయి. కోర్సులో మూడు నెలల శిక్షణ ఉంటుంది. 2016 నుంచి ఇప్పటి వరకు మహిళలకు వృత్తి శిక్షణ కోర్సులతో పాటు యువకులకు పోలీసులు ఉద్యోగాలు, మోటార్‌ డ్రైవింగ్‌లో కలిపి మొత్తం ఇప్పటికి 1506 మందికి సేవా సమితి ద్వారా శిక్షణ అందించారు.

శిక్షణ చాలా బాగుంది



మానాన్న సింగరేణిలో పని చేస్తున్నాడు. నాకు పెళ్లి అయ్యింది. డిగ్రీ పూర్తిచేశాను. ఇంట్లో ఖాళీగా కూర్చోవడం కంటే ఏదైనా నేర్చుకోవాలనే సంకల్పంతో ఇక్కడికి వచ్చి టైలరింగ్‌ నేర్చుకుంటున్నారు. శిక్షణ ఎంతో బాగుంది. శిక్షణ పూర్తి అయిన తరువాత ఇంట్లోనే టైలరింగ్‌ చేస్తాను. వచ్చే డబ్బులు ఇంటి ఖర్చులకు ఉపయోగపడుతాయి. – కొమ్ము జ్యోత్స్న, టైలరింగ్‌

ఫ్యాషన్‌ డిజైనింగ్‌ నా లక్ష్యం



నాకు ఫ్యాషన్‌ డిజైనింగ్‌ చేయాలనేది లక్ష్యం. దీనికి ముందుగా టైలరింగ్‌ నేర్చుకోవాల్సి ఉంది. అందుకే టైలరింగ్‌ నేర్చుకుంటున్నాను. ఎంఎస్సీ జువాలజీ చేశాను. ఉద్యోగం లేకున్నా స్వయం ఉపాధి పొందవచ్చనే ఉద్దేశంతో నేను ఈ కోర్సు నేర్చుకున్నాక త్వరలో ఫ్యాషన్‌ డిజైనింగ్‌కు వెళ్తాను. – ఎల్‌.వనజాక్షి, టైలరింగ్‌

రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలి



కంపెనీ అందిస్తున్న శిక్షణ చాలా బాగుంది. శిక్షణ తరువాత స్వంతంగా యూనిట్లు పెట్టుకొని రాణించాలని ఉంది. కోర్సులు నేర్చుకున్న తరువాత స్వంత యూనిట్లు పెట్టుకోవడనికి అందరికి ఆర్థిక స్తోమత ఉండదు. కంపెనీ సొంత పూచికత్తుపై బ్యాంక్‌ రుణాలు ఇప్పిస్తే యూనిట్లు పెట్టుకోవడానికి అందరికి చాలా ప్రోత్సాహకంగా ఉంటుంది. –యస్‌ హీరామణి, బ్యూటీషియన్‌

మగ్గం వర్క్‌కు చాలా డిమాండ్‌



మగ్గం వర్క్‌కు మార్కెట్‌లో చాలా డిమాండ్‌ ఉంది. బ్లౌజ్‌లు, సారీలపై మగ్గం వర్క్‌ చేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ ఈ పనిచేస్తు సంపాదిస్తున్నారు. దీంతో చాలా మంది ఈ వర్క్‌ నేర్చుకోవడానికి చాలా ఉత్సాహం చూపుతున్నారు. – సొంబారి హేమలత, శిక్షకురాలు

ఆర్థిక స్వావలంబన సాధించాలి



సింగరేణి మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడి ఆర్థిక స్వావలంభన సాధించాలనే ఉద్దేశంతో సేవా సమితి ఆధ్వర్యంలో అనేక వృత్తి కోర్సులను నేర్పిస్తున్నాం. శిక్షణ పూర్తయిన తరువాత సొంత యూనిట్లు పెట్టుకుని రాణించాలి. స్వయం ఉపాధి కల్పించే కోర్సులనే ఇక్కడ నేర్పిస్తున్నాం. మంచి శిక్షకులను పెట్టి శిక్షణ అందిస్తున్నాం. – బి.రాధాకుమారి, సేవా అధ్యక్షురాలు, శ్రీరాంపూర్‌

ఏఐసీసీ ఎల్‌డీఎంగా కో–ఆర్డినేటర్‌గా రఘునాథ్‌రెడ్డి


రఘునాథ్‌రెడ్డి

రామకృష్ణాపూర్‌: ఏఐసీసీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న లీడర్‌షిప్‌ డెవలప్‌మెంట్‌ మిషన్‌(ఎల్‌డీఎం) ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా రామకృష్ణాపూర్‌కు చెందిన కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నింట్‌ రఘునాథ్‌రెడ్డిని నియమించారు. కాంగ్రెస్‌ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌ 50మంది కో–ఆర్డినేటర్ల జాబితాను ఇటీవల ప్రకటించగా అందులో రఘునాథ్‌రెడ్డి పేరు ఉండటం పట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏరియా ఆస్పత్రి నిర్వీర్యానికి కుట్రలు


మాట్లాడుతున్న రాజమొగిలి

తాండూర్‌: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి నిర్వీర్యానికి కుట్రలు జరుగుతున్నాయని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు సిద్దంశెట్టి రాజమొగిలి తెలిపారు. ఆదివారం తాండూర్‌ ఐబీ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో ఒకానొక దశలో వెలుగు వెలిగిన ఏరియా ఆసుప్రతిని ప్రస్తుతం డిస్పెన్సరీ స్థాయికి దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏరియాలో కార్మికుల సంఖ్య తగినంతగా లేదని యాజమాన్యం చెబుతుండడం సరికాదన్నారు. కార్మికులకు మెరుగైన వైద్యసౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపైన ఉందన్నారు. బొగ్గుగనులను ప్రైవేట్‌పరం చేస్తూ రెగ్యులర్‌ కార్మికులను కుదించడం సరికాదన్నారు. కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు సూరం దామోదర్‌ రెడ్డి , ఐఎన్‌టీయూసీ నాయకులు పేరం శ్రీనివాస్‌, మాధవ కృష్ణ, సంజీవరెడ్డి, నయీమ్‌ ఉన్నారు.

60 కుటుంబాలు.. 160 మంది..





నేటి ఆధునిక, డిజిటల్‌ సమాజంలో మనిషి కాలంతో పోటీ పడుతున్నారు. బిజీ బిజీగా గడుపుతున్నారు. కుటుంబ సభ్యులకు, బంధువులకు సమయం కేటాయించే తీరిక దొరకడం లేదు. ఇంత బిజీ కాలంలో మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన రాచకొండ వంశానికి చెందిన 60 కుటుంబాలు ఆదివారం ఒక్కచోట చేరాయి. విద్యార్థులు అపూర్వ సమ్మేళనం తరహాలో వంశంలోని అందరూ ఒక్కచోట చేరారు. హాజీపూర్‌ మండలం వేంపల్లిలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ సమ్మేళనానికి 60 కుటుంబాలకు చెందిన 160 మంది హాజరయ్యారు. ముత్తాత నుంచి మునిమనువడి వరకు అందరూ ఈ సమ్మేళనంలో కలిశారు. ఒకరికొకరూ పరిచయాలు చేసుకున్నారు. సాయంత్రం వరకూ ఆటా పాటలతో హాయిగా గడిపారు. ఆత్మీయ సమ్మేళనానికి కారణమైన రాచకొండ పద్మ–నాగేశ్వర్‌రావు దంపతులను సమస్త రాచకొండ కుటుంబ సభ్యులు సన్మానించారు. తమ వంశంలోని కుటుంబాలన్నీ ఒక్కచోట కలవడం ఆనందంగా ఉందన్నారు రాచకొండ ఆత్మీయ సమ్మేళనం కన్వీనర్‌ రాచకొండ నాగేశ్వర్‌రావు. – మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌)

ఆకట్టుకున్న బొమ్మలకొలువు


నృత్యం చేస్తున్న సింగరేణి అధికారుల సతీమణులు

మందమర్రిరూరల్‌: మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్‌ ఆవరణలో ఆదివారం లేడీస్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి సేవా సమితి పల్లవి చంద్రశేఖర్‌ (డైరెక్టర్‌ సతీమణి) హాజరై ప్రారంభించారు. ప్రతి ఏడాది సింగరేణి వ్యాప్తంగా లేడీస్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లేడీస్‌ క్లబ్‌ ఏరియా అధ్యక్షురాలు లక్ష్మి శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సేవా సమితి కుటుంబ సభ్యులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సభ్యులు డాలీసూర్‌, రాధా సంజీవరెడ్డి, పద్మ నారాయణ, శ్రీదేవి టీవీరావు, కళ్యాణి శ్రీనివాస్‌, సవిత మనోహర్‌, నిమ్మిజాన్‌ఆనంద్‌, స్వరాజ్యం సూర్యనారాయణరాజు, స్వరూప దేవేందర్‌, విజయ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మీ సేవ నిర్వాహకుడిపై కేసు

సాక్షి ఎఫెక్ట్‌..

కోటపల్లి: ఆలుగామ గ్రామంలో మీసేవా నిర్వాహకుడు ఈకేవైసీ పేరుతో దోపిడీ శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి పలువురు బాధితులు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆలుగామ గ్రామంలోని మీసేవా కేంద్రం నిర్వాహకుడు సురేశ్‌పై కేసు నమోదు చేశారు. ఆలుగామ గ్రామంలో మీసేవా నిర్వాహకుడు ఈకేవైసీ కోసం వచ్చే వినియోగదారుల ఖాతాల నుంచి డబ్బులు కాజేసినట్లు బాధితులు తెలుపడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఎస్సై వెంకట్‌ మాట్లాడారు. రైతులు, ప్రజలు మీ సేవా వద్ద, ఇతర నెట్‌ సెంటర్ల వద్ద కేవైసీ ఇచ్చే క్రమంలో మోసపోవద్దని తెలిపారు. డబ్బులు విత్‌డ్రా చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.

ట్రాక్టర్‌ బోల్తా.. ఒకరి మృతి

- తమ్ముడు మృత్యువాత.. అన్నకు గాయాలు


గిరిధర్‌ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు


గిరిధర్‌(ఫైల్‌)

నెన్నెల(భీమిని): ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ బోల్తాపడి ఒకరు మృతిచెందిన సంఘటన భీమిని మండలంలోని మల్లీడి గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై సురేశ్‌ వివరాల ప్రకారం... మల్లీడి గ్రామానికి చెందిన గుర్రాల గిరిధర్‌ (29), అతడి అన్న రాజశేఖర్‌ అదే గ్రామంలోని రైస్‌మిల్లుకు వడ్లు పట్టించేందుకు వెళ్తున్నారు. రాజశేఖర్‌ ట్రాక్టర్‌ నడుపుతుండగా గిరిధర్‌ పక్కనే కూర్చున్నాడు. గ్రామ సమీపంలోకి రాగానే కల్వర్టు వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గిరిధర్‌ సంఘటన స్థలంలోనే మృతిచెందగా రాజశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని 108లో బెల్లంపల్లి ఆస్పత్రికి అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు. తండ్రి శంకర్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బొక్కల'గుట్ట'ను రక్షిద్దాం..

- గ్రామస్తుల వేడుకోలు
- మైనింగ్‌ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపాటు
- గుట్టను పరిరక్షించాలని తీర్మానం


వాకింగ్‌ ట్రాక్‌ ఏర్పాటు చేసిన గ్రామస్తులు


తవ్వకాలు చేస్తున్న బొక్కలగుట్ట

రామకృష్ణాపూర్‌: అనుమతులకు మించి అక్రమంగా క్వారీని తవ్వుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బొక్కలగుట్ట గ్రామస్తులు డిమాండ్‌ చేస్తున్నారు. గ్రామ శివారులోని సర్వే నెంబరు 139లో క్వారీ తవ్వకం కోసం ఇద్దరు వ్యక్తులు అనుమతులు తీసుకుని నిబంధనలకు పాటించకుండా తవ్వకాలు చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

మైనింగ్‌ అధికారులు వంత పాడుతున్నారా.?

అక్రమంగా క్వారీ తవ్వకాలు జరుగుతున్నప్పటికీ మైనింగ్‌శాఖ అధికారులు చోద్యం చేస్తున్నారని బొక్కలగుట్ట గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఈ మేరకు గ్రామస్తులే స్వయంగా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించిన వీడియో క్లిపింగ్‌ను శనివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌ చేశారు. దాదాపు రెండు ఎకరాలకు పైగా విస్తీర్ణంలో బొక్కలగుట్ట క్వారీ తవ్వకాలు జరుగుతుంటే మైనింగ్‌శాఖ అధికారులు పట్టించుకోకపోవటం విమర్శలకు తావిస్తోంది.

గుట్ట పరిరక్షణకు..

గ్రామంలోని గుట్టను తామంతా కలిసికట్టుగా ఉండి పరిరక్షించుకోవాలని బొక్కలగుట్ట గ్రామస్తులు తీర్మానించుకున్నారు. ఇందులో భాగంగా గుట్టచుట్టూ తవ్విన క్వారీ ప్రాంతాన్ని వాకింగ్‌ ట్రాక్‌గా వాడుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం ఉదయం 6గంటలకు ఈ ట్రాక్‌ను ప్రారంభిస్తున్నామని, ప్రతీ రోజు యువకులు, ఉత్సాహవంతులు వచ్చి వాకింగ్‌ ట్రాక్‌లో పాల్గొనాలని సూచించారు. గ్రామానికి సమీపంలో నాలుగు వరుసల జాతీయ రహదారి ఉన్న నేపథ్యంలో మార్నింగ్‌ వాక్‌కు ఇబ్బందిగా ఉంటుందని ఈ గుట్ట ప్రాంతాన్ని వాకింగ్‌ ట్రాక్‌లా వాడుకోవాలని కోరారు.

రాజ్యాధికారమే బీఎల్‌ఎఫ్‌ అంతిమ లక్ష్యం


కరపత్రాలు విడుదల చేస్తున్న శ్రేణులు

బెల్లంపల్లి: బహుజనులకు రాజ్యాధికారమే బహుజన లెఫ్ట్‌ ఫ్రంట్‌ (బీఎల్‌ఎఫ్‌) అంతిమ లక్ష్యమని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ అన్నారు. ఆదివారం బెల్లంపల్లి కొత్త బస్టాండ్‌ ఏరియాలో బీఎల్‌ఎఫ్‌ 5వ ఆవిర్భావ సభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజ్యాధికారం లక్ష్యంగా అవతరించిన బీఎల్‌ఎఫ్‌ ఐదేళ్ల ప్రాయాన్ని పూర్తి చేసుకోబోతోందన్నారు. జనాభాలో 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు తమ నిష్పత్తి ప్రకారం చట్ట సభల్లో ప్రాతినిధ్యం వహించకుండా రాజకీయ, ఆర్థిక, సామాజిక సమానత్వం సాధించడం సాధ్యం కాదన్నారు. ఈ నెల 25న హైదరాబాద్‌ బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్‌ భవన్‌లో బీఎల్‌ఎఫ్‌ 5వ ఆవిర్భావ సభ జరుగుతుందని తెలిపారు. బహుజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు. కార్యక్రమంలో ఎంసీపీఐ (యూ) శ్రేణులు రాజేంద్ర ప్రసాద్‌, పసులేటి వెంకటేష్‌, ఆకాష్‌, కొప్పర్ల కృష్ణ వంశీ, రాజయ్య, వెంకన్న, శంకర్‌ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


పూర్వ విద్యార్థులు

జైపూర్‌: మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1996–1997 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగరీత్యా ఆయా ప్రాంతాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులందరూ ఒక చోట కలుసుకున్నారు. పాఠశాలలో చదువుకున్న సమయంలోని జ్ఞాపకాలను ఈ వేదిక ద్వారా పంచుకున్నారు. వారికి బోధించిన ఉపాధ్యాయులు ప్రకాశ్‌రావు, దత్తకుమార్‌, సురేశ్‌, శ్రీదేవి, భారుతిరావులను శాలువాలతో సన్మానించి బహుమతులతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మద్దుల సురేందర్‌రెడ్డి, కట్కూరి సత్యనారాయణ, గుండు తిరుపతి, సంతోశ్‌, భానేశ్‌, సీను, తదితరులు పాల్గొన్నారు.

ఒకేచోటకు పూర్వవిద్యార్థులు


పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నస్పూర్‌: పట్టణ పరిధిలోని సీసీసీ సింగరేణి ఉన్నత పాఠశాల 1985–86లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో మళ్లీ కలిశారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు అనాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో గడ్డం నర్సయ్య, హరి బాలాజి, శేఖర్‌, రాజయ్య, సత్యనారాయణ, లలిత పాల్గొన్నారు.

నానమ్మ కర్మకాండకు వచ్చి మనుమడి మృతి

- స్నానానికి గోదావరిలో దిగి నీటమునక
- ఆరుగంటల తర్వాత మృతదేహం లభ్యం


గోదావరిలో లభ్యమైన హర్షవర్ధన్‌ మృతదేహం


రోదిస్తున్న కుటుంబ సభ్యులు


హర్షవర్ధన్‌ (ఫైల్‌)

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): నానమ్మ తొమ్మిదిరోజుల కర్మకాండ కోసం గోదావరికి వచ్చిన మనుమడు నీటమునిగి మృత్యువాత పడిన ఘటన ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. తల్లిదండ్రుల ఎదుటే కుమారుడు మునిగిపోతుంటే ఆ తల్లిదండ్రుల ప్రయత్నం విఫలమైంది. మందమర్రి మండలం ఊరు రామకృష్ణాపూర్‌కు చెందిన సల్లం నారాయణ తల్లి పోచమ్మ 9 రోజుల క్రితం మృతి చెందింది. తల్లి కర్మకాండ కోసం ఆదివారం నారాయణ భార్య స్వరూప, కుమార్తె పావని, కుమారుడు హర్షవర్ధన్‌ (20)తో పాటు ఇతర కుటుంబ సభ్యులతో కలిసి హాజీపూర్‌ మండలం ముల్కల్ల పుష్కర ఘాట్‌ వద్దకు వచ్చాడు. కుటుంబీకులు కర్మకాండ కార్యక్రమాల్లో బిజీగా ఉన్న సమయంలో హర్షవర్ధన్‌ స్నానం కోసం గోదావరిలోకి దిగాడు. నీరు లోతుగా ఉండటంతో మునిగిపోతూ కేకలు వేయడంతో గమనించిన కుటుంబ సభ్యులు పాడే ప్రయత్నం చేసినా ఫలితం కానరాలేదు.

6గంటల గాలింపు..

యువకుడు గల్లంతైన విషయం తెలుసుకున్న తహసీల్దార్‌ రాజలింగు, ఎస్సై ఉదయ్‌కిరణ్‌ సంఘటనా స్థలానికి చేరుకుని 10 మంది గంగపుత్రులతో గాలింపు చేపట్టారు. ఆరు గంటలకు పైగా శ్రమించి రాత్రి 7గంటల ప్రాంతంలో మృతదేహాన్ని బయటకుతీశారు.